


19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శనివారం 21 ఫిబ్రవరి 2026 పేజీలు 8


రోగులకు నాణ్యమైన సేవలు అందాల్సిందే..

# రాజీకి తావులేదు



- సంతృప్తికర వైద్య సేవల్లో జీజీహెచ్ ముందుండాలి
- న్యూ జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- రోగులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

ఎన్టీఆర్ జిల్లా, ఫిబ్రవరి 20, మేజర్ న్యూస్ : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ శుక్రవారం రాత్రి విజయవాడలోని న్యూ జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, శుభ్రత, ఔషధాల లభ్యత, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు ఉన్న మిగతా 2లో...



## నేడే భారీస్థాయిలో ఆర్గానిక్ రైతోత్సవం

అన్నదాతలు, ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోండి

కార్యక్రమం విజయవంతానికి సమష్టిగా కృషిచేద్దాం

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

వివరాలు 2లో...

## ప్రత్యేక స్టాంప్ చట్టం ఏపీకి అవసరం



- పాసుపుస్తకాలపై జగన్ తన ఫోటోలు వేసుకోవడం దారుణం
- రాజముద్రతో కూటమి ప్రభుత్వం కొత్త పాసుపుస్తకాలు పంపిణీపై హర్షం
- ఒక ప్రభుత్వ హయంలో రికార్డులు ట్యాంపర్ చేసిన ఎంఆర్ఓ పై విచారణ జరపాలి
- కృష్ణా యూనివర్సిటీ భూమి కేటాయింపు ఫైలును వేగవంతం చేయాలి
- జగన్ అసెంబ్లీకి రాకుండా 'మార్నింగ్ షో', 'మ్యాట్నీ షో' లాగా ముడేసి గంటల పాటు ప్రెస్ మీట్లు పెడుతున్నాడు
- ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు

2

## హనుమాన్ జంక్షన్ నూతన సీఐ కార్యాలయం ప్రారంభం

నేరాల నియంత్రణలో పోలీసుల సమర్థ సేవలు

డీఎస్పీ చలసాని శ్రీనివాస్



వివరాలు 7లో



## ఆకలి లేని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం... 6



## 23న జాబ్ మేళా

వివరాలు 3లో..



## ఏపీకి ప్రత్యేక స్టాంప్ చట్టం అవసరం

**పాసుపుస్తకాలపై జగన్ తన ఫోటోలు వేసుకోవడం దారుణం**

**రాజముద్రతో కూటమి ప్రభుత్వం కొత్త పాసుపుస్తకాలు పంపిణీపై హర్షం**

**ఒక ప్రభుత్వ హయంలో రికార్డులు ట్యాంపర్ చేసిన ఎంఆర్ఓ పై విచారణ జరపాలి**

**కృష్ణా యూనివర్సిటీ భూమి కేటాయింపు ఫైలును వేగవంతం చేయాలి**

**జగన్ అసెంబ్లీకి రాకుండా 'మార్నింగ్ షో', 'మ్యాట్నీ షో' లాగా ముడేసి గంటల పాటు ప్రెస్ మీట్లు పెడుతున్నాడు**

**ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు**

**గన్నవరం, ఫిబ్రవరి 20, మేజర్ న్యూస్ :** రాష్ట్ర శాసనసభలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖపై జరిగిన చర్చలో గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు కీలక సూచనలు చేశారు. రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంపుల విభాగానికి 3,867 కోట్ల 52 లక్షల 29 వేల రూపాయలు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలుపుతూనే, ఆదాయాన్ని పెంచుకునే మార్గాలపై ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 1899 నాటి బ్రిటీష్ కాలం నాటి ఇండియన్ స్టాంప్ యాక్ట్ అమలవుతోందని, దీనివల్ల రాష్ట్రానికి రావాల్సిన అదనపు ఆదాయం ఆగిపోతోందని ఆయన పేర్కొన్నారు. కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్ వంటి రాష్ట్రాలు తమ సొంత స్టాంప్ చట్టాలను సవరించుకుని అదనపు ఆదాయాన్ని పొందుతున్నాయని, ఉదాహరణకు రాజస్థాన్‌లో గో సంరక్షణ నిధి కోసం 10% అదనపు స్టాంప్ డ్యూటీ వసూలు చేస్తున్నారని వివరించారు. ఏపీలో కూడా నిర్దిష్ట ఏపీ స్టాంప్ చట్టాన్ని తీసుకువస్తే, రాష్ట్ర ఖజానాకు ఏటా కనీసం 3,000 కోట్ల రూపాయల అదనపు ఆదాయం సమకూరుతుందని, దీనిపై సంబంధిత మంత్రి అధ్యయనం చేయాలని కోరారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ,19 మంది ముఖ్యమంత్రులు పరిపాలించిన ఈ రాష్ట్రంలో ఎవరికీ రాని ఆలోచన జగన్మోహన్ రెడ్డికి వచ్చిందని, ప్రజల ఆస్తులైన పాస్ బుక్కులపై తన ఫోటో వేసుకోవడం దారుణమని, దీనికి ఆయన సిగ్గుపడాలని విమర్శించారు. కృష్ణా బ్యారేజీ కట్టిన సర్ ఆర్థర్ కాటన్ గానీ, రైతులకు భూమి హక్కులు కల్పించిన థామస్ మన్రో గానీ తమ ఫోటోలు వేసుకోలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజముద్రతో పాస్ బుక్కులు ఇస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. తన నియోజకవర్గంలోని మర్లపాలెం గ్రామాన్ని 22ఏ నుంచి తొలగించినందుకు మంత్రికి ధన్యవాదాలు చెబుతూనే, ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే కృష్ణా యూనివర్సిటీ స్థాపన కోసం విజయవాడ రూరల్ మండలంలో 10 ఎకరాల భూమి కేటాయించామని, కలెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఆ ఫైలును త్వరితగతిన క్లియర్ చేయాలని మంత్రిని అభ్యర్థించారు. గన్నవరం, విజయవాడ రూరల్ మండలాల్లో భూముల అన్యాక్రాంతంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో నరసింహారావు అనే ఎంఆర్ఓ రెండు మండలాల్లో ఉంటూ రికార్డులను ట్యాంపర్ చేశారని, లక్షల ఓట్లు ఉన్న ప్రాంతంలో భారీగా దోపిడీ జరిగిందని ఆరోపిస్తూ ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విజయవాడ రూరల్ మండలంలో విలేజ్ హెల్త్ సెంటర్లు కట్టడానికి కూడా స్థలం లేనంతగా ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లలో కలిసిపోయాయని వాపోయారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దీనిపై విచారణకు ఆదేశించినా కమిటీ పని ప్రారంభించలేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిపక్ష హోదా కోరుతున్న జగన్మోహన్ రెడ్డికి, చట్టసభల నియమ నిబంధనలు, సాంప్రదాయాలపై ఆయనకు అవగాహన లేదని విమర్శించారు. 'కౌల్ అండ్ షక్దర్' రాసిన పార్లమెంటరీ ప్రాక్టీస్ బుక్ అమెజాన్‌లో 3,250 రూపాయలకు దొరుకుతుందని, ఆ పుస్తకాన్ని ఎమ్మెల్యేలందరికీ, ముఖ్యంగా జగన్ కి పంపిస్తే అది చదువుకుని హోదా గురించి అడగటం మానేస్తారని ఎద్దేవా చేశారు. జగన్ అసెంబ్లీకి రాకుండా బయట ప్రెస్ మీట్లు పెడుతూ 'మార్నింగ్ షో, మ్యాట్నీ షో'లలాగా మాట్లాడుతున్నారని, 10% సీట్లు లేవు కాబట్టి ప్రతిపక్ష హోదా రాదని స్పష్టం చేశారు. గేట్ నెంబర్ 4 నుంచి రావడం అవమానంగా భావిస్తే, మాజీ ముఖ్యమంత్రిగా కనీసం గేట్ నెంబర్ 2 నుంచి అయినా వచ్చే అవకాశం కల్పిస్తే జగన్ సభకు వస్తారేమో పరిశీలించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# రోగులకు నాణ్యమైన సేవలు అందాల్సిందే.. రాజీకి తావులేదు






(మొదటిపేజీ తరువాయి)

నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి రోగికి సమయానుకూలంగా నాణ్యమైన చికిత్స అందాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ విభాగం (ఓపీ), ఇన్ పేషెంట్ వార్డులు, ఎమర్జెన్సీ విభాగం, సూపర్ స్పెషాలిటీ బ్లాక్, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు, ఔషధ పంపిణీ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బందికి సేవల మెరుగుదలపై సూచనలు ఇచ్చారు. ప్రత్యేకంగా పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రోగులు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని సూచించారు. అత్యవసర సేవలు 24 గంటల పాటు సమర్థవంతంగా అందేలా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని, రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో సేవలు పొందే ప్రతి ఒక్కరూ సంతృప్తిగా వెళ్లేలా చూడటం మన ప్రధాన లక్ష్యమని తెలిపారు. సంతృప్తికర వైద్య సేవలందించడంలో జీజీహెచ్ రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలవాలని, ప్రతి విభాగం బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# వారంలో ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్స్‌కు స్థలాల సేకరణ పూర్తి కావాలి

**విజయవాడ ఫిబ్రవరి 20, మేజర్ న్యూస్ :** నగరాలు, పట్టణాలలో ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్స్‌కు కావలసిన భూ సేకరణ వారం లోపల పూర్తి చేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్లు(ఆర్డీలు), మున్సిపల్ కమిషనర్లు, ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్స్ నెలకొల్పే ఏజెన్సీల వారితో శుక్రవారం ఆయన వీడియో సమావేశంలో మాట్లాడారు. ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్స్‌ని ఎంత తొందరగా ఏర్పాటు చేస్తే, అంత తొందరగా లెగసీ వేస్ట్‌ని క్లియర్ చేయగలుగుతామని చెప్పారు. అప్పుడే, డంప్ యార్డులలో పేరుకుపోయిన చెత్తని కూడా క్లియర్ చేసి, ఆ ప్రాంతంలో పచ్చదనంతో నిండిన పార్కులు ఏర్పాటు చేసుకోగలుగుతామని చెప్పారు. బయోమైనింగ్ క్లియరెన్స్‌కు ప్రాసెసింగ్ యూనిట్లే కీలకం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఈ అంశాలపైనే దృష్టిపెట్టమన్నా రని చెప్పారు. ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్స్‌కు స్థలాల సేకరణకు, యూనిట్స్ ప్రారంభించడానికి చైర్మన్ పట్టాభిరామ్ డెడ్ లైన్ విధించారు. రాష్ట్రంలో మొత్తం 107 నగరాలు, మున్సిపాల్టీలలో ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్స్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. వాటిలో 72 చోట్ల మాత్రమే భూమి అందుబాటులో ఉందన్నారు. మిగిలిన చోట్ల కూడా యూనిట్స్ స్థాపనకు భూమిని గుర్తించి, ఖరారు చేయాలన్నారు. అలాగే, మనం సేకరించే భూములు ఆయా నగరాలు, పట్టణాలకు అవకాశం ఉన్నంతమేర దగ్గరగా ఉండేట్లు చూడాలన్నారు. కొన్ని మున్సిపాల్టీలలో భూమి అందుబాటులో ఉందని, అయితే, రెండు మూడు స్థలాలు ఉన్నందున ఏదో ఒక భూమిని ఖరారు చేయవలసి ఉందని ఆర్డీలు చైర్మన్ పట్టాభిరామ్ కు వివరించారు. మరి కొన్ని చోట్ల భూమి అందుబాటులో లేనట్లు తెలిపారు. భూమి గుర్తింపునకు సంబంధించి మూడు రకాలుగా విభజించుకోమని చైర్మన్ పట్టాభిరామ్ అధికారులకు సలహా ఇచ్చారు. 1. అందుబాటులో ఉన్న భూమి, 2.భూములు అందుబాటులో ఉండి, ఖరారు చేయవలసిన భూమి, 3. భూమి అందుబాటులో లేకపోవడం మూడుగా విభజించుకొని, వేగవంతంగా స్థలాలు సమకూర్చమని ఆదేశించారు. ఏ జిల్లాలోనైనా భూమికి సమస్యలు ఉంటే, సంబంధిత అధికారులు ఆయా జిల్లాల కలెక్టర్లను కలిసి, సమస్య వివరిస్తే పరిష్కరిస్తారని పట్టాభిరామ్ చెప్పారు.

**ఏజెన్సీలకు డెడ్ లైన్ :** ఒప్పందం ప్రకారం నాలుగు నెలల్లో ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్స్ సిద్ధం చేయాలని ఏజెన్సీలను చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశించారు. ఏజెన్సీల వారు ఆయా ఆర్డీలను కలిసి, సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. యూనిట్స్ స్థాపించే వివరాలు, భూములకు సంబంధించిన డేటాను ఆర్డీలకు అందజేయమన్నారు. రెండు నెలల్లో సివిల్, ఎలక్ట్రిక్ వర్క్ పూర్తి చేయాలని, మరో 5 వారాల్లో మిషనరీ పనులు పూర్తి కావాలని, ఆ తర్వాత మరో వారంలో ట్రైల్ రన్ నిర్వహించాలని ఆదేశించారు. ఒప్పందం ప్రకారం మొత్తం నాలుగు నెలల్లో యూనిట్లను ప్రారంభించాలని డెడ్ లైన్ విధించారు. ప్లాంట్ ఏర్పాటుకు భూమితోపాటు పవర్ కూడా అందుబాటులో ఉందో,లేదో ముందుగానే చెక్ చేసుకోవాలని సూచించారు. అనుకున్న సమయానికి ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్స్ పనులు పూర్తి కావడానికి అందరూ సహకరించాలని చైర్మన్ పట్టాభిరామ్ కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఆర్డీలు, కమిషనర్లు, ఇతర అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడే భారీస్థాయిలో ఆర్గానిక్ రైతోత్సవం



**అన్నదాతలు, ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోండి**

**కార్యక్రమం విజయవంతానికి సమష్టిగా కృషిచేద్దాం**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఎన్‌టీఆర్ జిల్లా, ఫిబ్రవరి 20, మేజర్ న్యూస్ :** ఈ నెల 21వ తేదీ శనివారం ఎ.కొండూరు మండలం, కృష్ణారావుపాలెంలో భారీస్థాయిలో ఎన్‌టీఆర్ జిల్లా సేంద్రియ మేళా-ఆర్గానిక్ రైతోత్సవం జరగనుందని.. అన్నదాతలు, ప్రకృతి వ్యవసాయ ఔత్సాహికులు పెద్దఎత్తున పాల్గొని, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. ఈ నెల 21న కృష్ణారావుపాలెం, 22వ తేదీన విజయవాడలో ఎన్‌టీఆర్ ఆర్గానిక్ రైతోత్సవం జరగనున్న నేపథ్యంలో వీటికి చేస్తున్న ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి రెవెన్యూ, ప్రకృతి వ్యవసాయం, ఉద్యాన, పశుసంవర్ధక తదితర సమన్వయ శాఖల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు రైతులకు సామర్థ్య అభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ మేళాలో సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ స్టాళ్లు కూడా ఉంటాయని, సేంద్రియ సాగుకు అవసరమైన ఉత్పాదితాల ప్రదర్శన ఉంటుందన్నారు. రైతునిపుణుల పరస్పర చర్చా వేదికల ద్వారా సందేహాల నివృత్తితో పాటు మేధోమథనానికి అవకాశం కల్పించినట్లు వివరించారు. ఇదేవిధంగా ప్రకృతి వ్యవసాయ రైతులు, వినియోగదారులు, సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే లక్ష్యంతో ఈ నెల 22వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలోనూ ప్రకృతి వ్యవసాయ మేళాను నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రైతులు పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధర లభించేలా మార్కెటింగ్ లింకేజీలు ఏర్పాటు చేయడంతో పాటు ఎంవోయూలపై అవగాహనతో పాటు అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించి, మంచి ఫలితాలు వచ్చేలా అధికారులు సమన్వయంతో కృషిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

# పేదలకు కుట్టు మిషన్లు, టిఫిన్ బండ్లను పంపిణీ









**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** శుక్రవారం సిటీ ఏ.ఆర్.గ్రౌండ్‌లో ఎన్.టి.ఆర్.జిల్లా సురక్ష కమిటీ కన్వీనర్ కె.వి. నరసయ్య, మెడ్ ప్లస్ ఆధ్వర్యంలో ఎన్.టి.ఆర్.పోలీసు కమిషనర్ రేట్‌లోని పేద మహిళలకు కుట్టు మిషన్లను, వృద్ధులకు టిఫిన్ బండ్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ముఖ్య అతిదిగా పాల్గొని పేదలకు కుట్టు మిషన్లు, టిఫిన్ బండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ మాట్లాడుతూ..... ప్రజలలో సేఫ్టీ కల్చర్ తీసుకురావడమే లక్ష్యంగా చేసుకుని సురక్షా కమిటీలను ఏర్పాటు చేశారు. నగరంలో సుమారు పది వేల ఐదు వందల సి.సి.కెమెరాలు ఏర్పాటు చేయడానికి ఈ సురక్షా కమిటీలు కీలకంగా వ్యవహరించారు. సురక్ష కమిటీ కన్వీనర్ కె.వి. నరసయ్య, మానవ సేవే మాధవ సేవ అనే విధానాన్ని అవలంబిస్తూ మహిళా పోలీసు సిబ్బందికి ఉచిత మెడికల్ క్యాంప్ లను నిర్వహించారు. సురక్ష కమిటీ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే పర్యావరణ పరిరక్షణ, కొండలపై 70 వేల విత్తనాలను డ్రోన్ల ద్వారా చల్లించడం జరిగింది. టి.టి.డి.అన్నధానానికి కూరగాయలను పంపించడం జరిగింది. అదే విధంగా ఈ రోజు పేద మహిళలకు 20 కుట్టు మిషన్లు, వృద్ధులకు 06 టిఫిన్ బండ్లను కె.వి. నరసయ్య, మెడ్ ప్లస్ వారి ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత మాట్లాడుతూ మన పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆధ్వర్యంలో సుమారు 10 వేల సి.సి.కెమెరాలు, 42 డ్రోన్ లను ఏర్పాటు చేసిన ఘనత భారత దేశంలోనే మొట్టమొదటిగా మన ఎన్.టి.ఆర్. పోలీసు కమిషనరేట్‌కు దక్కిందని, ఈ క్రమంలోనే ప్రజలందరిని సమాయత్తం చేసి మీ రక్షణ మా బాధ్యత మా రక్షణ మీ భాధ్యత అనే నినాదంతో సురక్ష కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కమిటీకి కన్వీనర్‌గా కె.వి.నరసయ్యని ఎంపిక చేయడం జరిగింది. మన పోలీసు కమిషనర్ ఆదేశాలతో సురక్ష కమిటీ కన్వీనర్ ఆధ్వర్యంలో చాలా మంచి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ఇటువంటి మంచి కార్యక్రమంలో మేము కూడా సహకరిస్తాం అంటూ ముందుకు వచ్చిన మెడ్ ప్లస్, సురక్ష కన్వీనర్ నరసయ్యకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, డి.సి.పి. కె.జి.వి. సరిత, ఏ.ఆర్.ఏ.డి.సి.పి. కె.కోటేశ్వర రావు, ఏ.ఆర్.ఏ.సి.పి. ప్రేమ్ కుమార్, సురక్షా కమిటీ కన్వీనర్ కుదరవల్లి నరసయ్య, మెడ్ ప్లస్, ప్రతినిధులు, తదితరులు పాల్గొనడం జరిగింది.

## శ్రీరాముడు అందరికీ ఆదర్శ పురుషుడు

**కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** శ్రీరాముడు అందరికీ ఆదర్శ పురుషుడని, హిందూ బంధువుల ఆరాధ్య దైవం అని, ఆ భగవంతుని కృపతో ప్రతి గ్రామము రామరాజ్యంలా విలసిల్లాలని కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు పంచాయతీ వన్నారు కానూరు గ్రామంలో శుక్రవారం గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతనముగా నిర్మాణము చేస్తున్న రామాలయంలో నూతన సింహా ద్వార ముహుర్త పూజా కార్యక్రమము ఘనముగా నిర్వహించారు. గోపు సత్యనారాయణ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా "గోపు" మాట్లాడుతూ రాముడంటే భక్తి మాత్రమే కాదని ఆయన ఆదర్శ పురుషుడని అన్నారు. అయోధ్యలోని రామ మందిరం భారతదేశ సమగ్రతకు, సమైక్యతకు, ప్రతిబింబంగా నిలుస్తుందన్నారు. ధర్మ పరిరక్షకుడైన శ్రీరాముని దేవాలయం ప్రతి గ్రామంలోనూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపు వెంకన్న, పాండు గోపు ప్రతాప్, నరేష్ బొలిశెట్టి నాని గోపు వెంకట రమణ, ఈవన వెంకన్నలు వీర శ్రీనివాసరావు జొన్నల రాంబాబు, ఈవన రామారావు వీర పెద్దిరాజులు, గోపు కనక పెద్ది రాజులు దంపత సమేతంగా పూజలో పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీసంపటాలమ్మ ఆలయ వార్షికోత్సవం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి గ్రామ దేవత, చల్లనితల్లి శ్రీసంపటాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ 27వ వార్షిక మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, యువనేత మండలి వెంకట్రామ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి చల్లపల్లి కోటేశ్వరరావు దంప తులు అమ్మవారికి పూజలు జరిపారు. ఆలయ కమిటీ పెద్దలు వెంకట్రామ్ను ఆలయ మర్యాదలతో సన్మానించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, టీడీపీ నేతలు షేక్ నబీఘోరి, జన్ను నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా వేలాదిమంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సుమారు ఆరువేల మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ పెద్దలు యడ్ల మదుసూధనరావు, లంక కొండలు, గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, రావులపల్లి వెం కటేశ్వరరావు, కొలుసు మోహనరావు, కొల్లిపర సాంబశివరావు, విన్నకోట శంకర్, పత్తిపాటి రత్నం తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# ప్రతి విద్యార్థి తనకు గల రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి






**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సమాజంలో మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాల గురించి, వాటి నుంచి తాము ఎలా రక్షించుకోవాలో ప్రతి విద్యార్థిని తప్పక తెలుసుకోవాలని శుక్రవారం స్థానిక మచిలీపట్నంలోని బాలాజీ విద్యలయంలో జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు ఆర్ పేట పోలీస్ స్టేషన్ సి ఐ, కే.ఏసుబాబు పోక్సో, ఇతర రకాలైన చట్టాల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న, సీఐ మాట్లాడుతూ రక్షణ చట్టాలు, ఏదైనా నేరాల బారిన పడితే పోలీసు వారి నుండి రక్షణ ఏ విధంగా పొందాలి, బాల్యవివాహాల కారణంగా ఎదురయ్యే దుష్పరిణామాలు, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన చర్యలు, ఆత్మరక్షణకు నేర్చుకోవాల్సిన ప్రాథమిక పద్ధతులపై విద్యార్థులకు విపులంగా వివరించారు. ఆత్మ రక్షణ చర్యల్లో భాగంగా సెల్ఫ్ డిఫెన్స్ కోర్సులను తప్పకుండా నేర్చుకోవాలని, ముఖ్యంగా సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని సూచించారు. ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే పోలీసులను లేదా మహిళా హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని, తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినిలలో చట్టపరమైన అవగాహన పెరగడంతో పాటు, తమ భద్రత పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలనే అవగాహన కలిగిందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. విద్యార్థులు కూడా ఎంతో ఉత్సాహంగా ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని వారికి గల సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

# వైసీపీ కల్తీ నెయ్యి అంశం పక్క దారిపట్టించేందుకే హెరిటేజ్‌పై దుష్ప్రచారం



**విజయవాడ మేజర్ న్యూస్ :** తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తున్న నేపథ్యంలో ఆ అంశం పక్క దారి పట్టించేందుకు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కల్తీ నెయ్యి వ్యవహారంలోకి కావాలనే నారా భువనేశ్వరి నడుపుతున్న హెరిటెజ్ సంస్థ పై వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ నాయకుడు మాదిగాని గురునాథం మండిపడ్డారు. వైసీపీ నాయకులు హెరిటెజ్ సంస్థ పై చేసిన అసత్య ఆరోపణలు ఖండిస్తూ శుక్రవారం గురునానక్ కాలనీలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో టీడీపీ నాయకుడు మాదిగాని గురునాథం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్‌సీపీ నేతల ఆరోపణలు "దొంగే దొంగ అని అరుస్తున్నట్లు" ఉన్నాయని విమర్శించారు. స్వార్థ రాజకీయ లాభాల కోసం వైసీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ, మీడియా దృష్టి ఆకర్షించేందుకు హెరిటేజ్‌పై బురద జల్లుతున్నారని ఆరోపించారు. ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మటానికి సిద్దంగా లేరన్నారు. ఈ నెల 14 వ తేదీన బ్లూ మీడియా పత్రికలో ప్రచురించిన కథనాలను సోషల్ మీడియాలో తొలగించాలని ఢిల్లీ హైకోర్టు చెప్పినా, కోర్టు ఆదేశాలను వైసీపీ బేఖాతరు చేసి... విమర్శలకు దిగుతోందని గురునాథం ఆగ్రహం వ్యక్తం చేశారు. హెరిటేజ్ సంస్థ రూ.100 కోట్ల పరువు నష్టం దావా కూడా దాఖలు చేసినట్లు తెలిపారు. శాసనమండలిలో వైసీపీ చేస్తున్న ఆరోపణలను నిరూపించమంటే... వాకౌట్ చేస్తూ బయటకు వెళ్లిపోతున్నారని ఎద్దేవా చేశారు. హెరిటేజ్ సంస్థను నారా భువనేశ్వరి సుమారు 33 సంవత్సరాల క్రితం కేవలం రూ.4 కోట్ల పెట్టుబడితో ప్రారంభించగా, ఈ సంస్థ 4 వేల కోట్ల టర్నోవర్‌తో ఎదిగి, దాదాపు మూడు లక్షల మంది పాడి రైతులకు ఆదాయ వనరుగా నిలుస్తోందన్నారు. నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, 300 మందికి పైగా నిపుణులతో ఉత్పత్తుల పరీక్షలు నిర్వహించే పారదర్శక వ్యవస్థగా హెరిటేజ్ నిలిచిందని వివరించారు. హెరిటేజ్‌కు ఎలాంటి సంబంధం లేని సంస్థలను కలిపి చూపిస్తూ వైయస్సార్‌సీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బోలే బాబా మిల్క్ ప్రొడక్ట్స్ కు హెరిటేజ్‌తో సంబంధం వుందని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అదే విధంగా ఇందాపుర్ సంస్థకూ హెరిటేజ్‌తో ఎలాంటి సంబంధం లేదని, ఆ సంస్థ ప్రతినిధులే స్పష్టంగా చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. హెరిటెజ్ సంస్థ తొమ్మిది రాష్ట్రాల్లో పారదర్శకమైన ఉత్పత్తులతో ముందుకెళ్తోందని వివరించారు. వైసీపీ హయంలో బ్లూ మీడియా భారతి సిమెంట్స్ వంటి సంస్థలకు అనుకూలంగా వ్యవహరించిన విషయాలు అందరికీ తెలిసినవేనని అన్నారు. వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలకు తప్పకుండా మూల్యం చెల్లించుకుంటారని... ఏపీలో వైసీపీ మనుగడ సాగించలేదని గురునాథం దుయ్యబట్టారు. సీఎంగా చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పారదర్శక పరిపాలన కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి అర్బన్ కో-ఆర్డినేటర్ వల్లభనేని నరసింహా చౌదరి, టీడీపీ క్రిస్టియన్ నాయకులు ఇత్తడి చార్లెస్ పాల్గొన్నారు.

# ప్రజల కోసం పోరాడే నాయకుడు సేవలో ముందుండే బొండా ఉమా



**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** శుక్రవారం ఉదయం 9:00 గంటల నుండి సింగ్ నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ఆదేశానుసారం నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమం విశేష స్పందనతో జరిగింది. ప్రజల సమస్యలే తన అజెండా, అభివృద్ధే తన లక్ష్యం అన్న నమ్మకంతో ఎమ్మెల్యే శాసనసభలో నియోజకవర్గ సమస్యలపై గళమెత్తి మాట్లాడుతూనే, కార్యాలయ స్థాయిలో కూడా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మార్గదర్శకత్వంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబ శివరావు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, ప్రభుత్వ పీఏ భార్గవ్ కార్యాలయ సిబ్బంది ప్రతి వినతిని శ్రద్ధగా స్వీకరించి, సంబంధిత అధికారులకు వెంటనే పంపించే చర్యలు చేపట్టారు. ఈ ప్రజా దర్బార్‌లో మొత్తం 1200 కు పైగా దరఖాస్తులు స్వీకరించబడగా, ఇళ్ల స్థలాలు, వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్లు, స్వయం ఉపాధి సాధనాల కోసం తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు, చిన్న వ్యాపారాల కోసం ఆర్థిక సహాయం, అలాగే నీరు, రహదారులు, కాలువలు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలపై అధికంగా వినతులు వచ్చాయి. అందిన ప్రతి దరఖాస్తును యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర సమస్యలకు తక్షణ చర్యలు తీసుకుంటూ, మిగిలిన అంశాలను వచ్చే 3040 రోజుల్లో పరిష్కరించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. సమస్య పరిష్కారం వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వందలాది మంది ప్రజలు హాజరై తమ సమస్యలను నేరుగా తెలియజేశారు, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యతగా భావిస్తున్న ఎమ్మెల్యే, "ప్రతి కుటుంబం సమస్యల నుండి విముక్తి పొందే వరకు నా పోరాటం కొనసాగుతుంది" అని స్పష్టం చేశారు. సెంట్రల్ నియోజకవర్గాన్ని సమస్యలేని ప్రాంతంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని, ప్రజల సేవే పరమోన్నత కర్తవ్యమని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మరోసారి తెలియజేశారు. ప్రతి శుక్రవారం ఇదే విధంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ సివిఏపి (నియోజకవర్గ దృక్పథ కార్యాచరణ ప్రణాళిక యూనిట్) స్పెషల్ ఆఫీసర్ ఎం.నాగ మల్లేశ్వర రావు, జోనల్ కమీషనర్ ప్రభుదాసు, స్వర్ణాంధ్ర ఏ2047 టీమ్, హౌసింగ్ ఏఈ ఇర్ఫాన్, విజయకృష్ణ సూపర్ బజార్ ఛైర్మన్ వెలగా సురేష్, యంగ్ ప్రొఫెషనల్ ఆర్.వెంకటేష్, సివిఏపి టీమ్ డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, ఎన్డీఏ కూటమి నాయకులు తదితర అధికారులు పాల్గొన్నారు.

# మైలవరంలో ఇప్పటికి రూ.13.65 కోట్ల సీఎంఆర్ఎఫ్ మంజూరు



## మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

## తాజాగా 36 మందికి రూ.16.24లక్షలు మంజూరు

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటికి రూ.13,65,10,127లు కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు అయినట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు. మైలవరం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో తాజాగా 36 మందికి రూ.16,24,276లు ఆర్థికసాయం తాజాగా మంజూరైంది. మైలవరం, గొల్లపూడి గ్రామాల్లోని శాసనసభ్యుని వారి కార్యాలయాలలో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు చెక్కులు రూపంలో ముఖ్యమంత్రి సహాయనిధిని శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ సహాయం నిజమైన భరోసాగా నిలుస్తోందన్నారు. పేదల ఆరోగ్య భద్రతే రాష్ట్ర ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని, అర్హులైన ఒక్కరికీ కూడా అన్యాయం జరగకుండా ప్రభుత్వ సహాయం తప్పకుండా అందేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు.రెడ్డిగూడెం మండలంలోని 6గురికి రూ.1.64 లక్షలు జి.కొండూరు మండలంలోని 9 మందికి రూ.5.32 లక్షలు, ఇబ్రహీంపట్నం మండలంలోని 5గురికి రూ.4.80 లక్షలు మైలవరం మండలంలో 14 మందికి 3.85 లక్షలు, విజయవాడ రూరల్ మండలంలోని ఇద్దరికి రూ.61వేలు, మొత్తం 36 మందికి రూ.16.24 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు వెల్లడించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్వల భవిష్యత్తు మీ చేతుల్లోనే....

## ప్రగతి విద్యాసంస్థల అధినేత పూర్ణచంద్రరావు





**మొవ్వ మేజర్ న్యూస్:** పబ్లిక్ పరీక్షలు రానున్న తరుణంలో సమయాన్ని వృధా చేయకుండా కష్టమైనా ఇష్టంగా చదివి ఉజ్వల భవిష్యత్తును నిర్ణయించే నిర్ణయం నీ చేతుల్లోనే ఉందని ప్రగతి విద్యాసంస్థల అధినేత పూర్ణచంద్రరావు పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన మొవ్వ లోగల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో నిర్వహించిన ప్రగతి ప్రేరణ కార్యక్రమంలో పూర్ణచంద్రరావు దంపతులు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు పలు సలహాలు సూచనలు అందించారు. మార్చి 16వతేది నుంచి ప్రారంభమయ్యేపదవతరగతి పబ్లిక్ పరీక్షలు మరొక నెలరోజుల లోపు మాత్రమే ఉండటంతోహాస్టల్లోని విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ఇష్టపడి చదువుకుంటూ హాస్టల్స్ లో నూరు శాతం సాధించి ఆ పాఠశాలకు, హాస్టళ్లకు మంచి పేరు తీసుకురావాలని పూర్ణచంద్రరావు దంపతులు పిలుపునిచ్చారు. ఉయ్యూరు డివిజన్ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.మోహన రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రగతి–ప్రేరణ కార్యక్రమంతో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించిచైతన్యపరిచారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉయ్యూరు డివిజన్‌లోని కూచిపూడి (బాలికలు), మొవ్వ (బాలురు, బాలికలు), శ్రీకాకుళం(బాలికలు) లోని స్పెషల్ హాస్టల్ లోగల 50 మంది పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పూర్ణచంద్రరావు దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు విలువైన సూచన చేశారు. అలాగే వారు తమ బంగారు భవిష్యత్తు కోసం తీసుకోవల సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–1 ఏ భాను ప్రకాష్. పి యం శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎన్. ఉమాశ్రీ, ఉపాధ్యాయులుపాల్గొని విద్యార్థులు భవిష్యత్తు కోసం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు ఆర్. ప్రసాదరావు (మొవ్వ ప్రత్యేకం), టి.శైలజ(కూచిపూడి) టి.వెంకటేశ్వరమ్మ, (మొవ్వ)పి. జ్ఞాన సుందరి(శ్రీకాకుళం) లతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



## నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో రహదారులను నిర్మించండి

**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పసుమర్రు గ్రామంలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన రహదారుల అభివృద్ధి పనులను ఎండిఓ కె.జ్యోతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారి అభివృద్ధి పనులలో నిబంధనలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. గ్రామస్తులు కూడా పనులను పర్యవేక్షించడం ద్వారా నాణ్యతతో కూడిన రహదారులు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మశ్రీవేణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అందరు పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ సహాయకులకు 21వ తేదీ శనివారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎండిఓ జె.విమాదేవి తెలిపారు. మండల పరిధిలో పనిచేస్తున్న ఒకటి నుండి 5వ గ్రేడ్ వరకు గల అందరు పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ శిక్షణకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఏ ఒక్కరికి ఎటువంటి మినహాయింపు లేదని ఆమె స్పష్టం చేశారు.

## బంగారు పతకంసాధించిన పెదపూడి ఉపాధ్యాయుడు



**మొవ్వ మేజర్ న్యూస్:** ఈనెల 13వతేది నుంచి15 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్పూర్‌లో జరిగిన 45వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో మండల పరిధిలోని పెదపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న సైకం. శివ నాగమల్లేశ్వరరావు 4×100 మీటర్స్ రిలే, 4×400 మీటర్స్ రిలే అంశాలలో రెండు బంగారు పతకాలు, 400 మీటర్స్ రన్నింగ్ లో రజత పతకం 400 మీటర్స్ హర్డిల్స్ లో కాంస్య పతకం సాధించారు. బంగారు పతకాలు సాధించి విజేతగా నిలిచిన శివ నాగమల్లేశ్వరరావును పాఠశాల ప్రధానోపాధ్యాయులు పామిరెడ్డి కరుణాకరరెడ్డి పాఠశాల విద్యా కుటుంబం ఘనంగా సత్కరించింది.

## నీరు నిలిచిపోకుండా జాగ్రత్తలు తప్పనిసరి




**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని నగర పాలక సంస్థ బయాలజిస్ట్. వి కామేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రశాంతి నగర్, ఎన్ఎస్ఎం స్కూల్ రోడ్, ఆచార్య రంగా నగర్, కృష్ణలంక, పసుపుతోట పరిసర ప్రాంతాల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలర్లు, పూల కుండీల్లో నీటిని తరచుగా మార్చాలని పేర్కొన్నారు. కొబ్బరి బోండాలు, పాత టైర్లు, కాళీ డబ్బాలో నీరు నిలిచి ఉండకుండా చూసుకోవాలన్నారు. వీధుల్లో ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, బయోలజీస్ట్ కామేశ్వరరావు, సబ్ యూనిట్ అధికారి రామ చంద్ర రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు..

## నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టారీత్యా చర్యలు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని 8వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గోలీ లెనిన్ బాబు అన్నారు. సర్కిల్-3 సర్కిల్ పరిధిలోని శానిటరీ ఇన్స్పెక్టర్లు నమోదు చేసిన కేసులు పై శుక్రవారం సర్కిల్-3 కార్యాలయంలో ఏర్పాటుచేసిన మొబైల్ కోర్టులో విచారణ జరిపారు. న్యాయమూర్తి గోలీ లెనిన్ బాబు మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేసినా, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టిన, రోడ్డుపైన పెంపుడు జంతువులు ఉంచిన, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై మొబైల్ కోడ్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లగించిన 15 మందిపై విచారణ జరిపి రూ.3,940 జరిమానా విధించారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ 3 డాక్టర్ గోపాల్ నాయక్, శానిటరీ సూపర్వైజర్స్ రమేష్ బాబు, బాలాజీ శ్రీనివాసమూర్తి, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## వైద్య పరీక్షలలో పాల్గొనండి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** సఫాయి మిత్ర సురక్ష శిబిరం ద్వారా నిర్వహించే వైద్య పరీక్షలలో పాల్గొని పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉండాలని, నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. శుక్రవారం తన పర్యటనలో భాగంగా జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీ, దుర్గా పురం, ఇన్నర్ రింగ్ రోడ్, సింగ్‌నగర్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పారి శుధ్య నిర్వహణ పరిశీలించారు. పారిశుధ్య కార్మికులకు ప్రత్యేకంగా సఫా యిమిత్ర సురక్ష శిబిర్ లో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించి వారిని ఆరోగ్యంగా చూసుకునే బాధ్యత ప్రజారోగ్య అధికారులదని, తరచుగా వివిధ ప్రదేశాల్లో సఫాయిమిత్ర సురక్ష శిబిరం నిర్వహించి పారిశుధ్య కార్మికులకు ప్రత్యేకమైన ఆరోగ్య పరీక్షలు చేస్తుండాలని అధికారులను ఆదేశించారు. జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలో జరుగుతున్న రోడ్డుపై ప్యాచ్ వర్క్ లను పరిశీలించారు. అక్కడ పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బంది కలగకూడదని, డ్రైనేజ్‌లో ఎటువంటి ఆటంకాలు లేకుండా పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. బుడమేరు కాలువలో ఎప్పటిక ప్పుడు గుర్రపు డెక్కలను తొలగించాలని నీటి పారుదలలో ఎటువంటి అవరోధాలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చం ద్రశేఖర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## 22న బీసీ సింహ గర్జన హక్కుల సాధనకు సమైక్యంగా నిలుద్దాం



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 20, మేజర్ న్యూస్ :** ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న బీసీ సింహ గర్జనను విజయవంతం చేయాలని కోన నాగార్జున పిలుపునిచ్చారు. హనుమాన్ జంక్షన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) కేవలం బీసీలకు మాత్రమే పరిమితమైన పార్టీ కాదని, బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ లక్ష్యం రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టి, వారి భవిష్యత్తు తరాలకు బలమైన బాటలు వేయడమేనని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో పార్టీ పోటీ చేస్తుందని ఆయన వెల్లడించారు. బీసీ సింహ గర్జన ప్రధాన డిమాండ్లుగా బీసీ రక్షణ చట్టం అమలు, రాజధాని ప్రాంతంలో బీసీలకు వెయ్యి ఎకరాల భూమి కేటాయింపు, బీసీ కార్పొరేషన్లకు తగిన నిధుల విడుదల, సమగ్ర కుల గణన, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో న్యాయం, స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని పేర్కొన్నారు. కాబట్టి బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ బీసీ సింహ గర్జనకు ప్రతి ఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోన నాగార్జున కోరారు. ఈ కార్యక్రమంలో బీసీవై ఏపీ కో-కన్వీనర్ కూచిపూడి వాసుదేవరావు, ఎన్టీఆర్ జిల్లా యూత్ కో-కన్వీనర్ ధన్నే రవి శేఖర్, గన్నవరం నియోజకవర్గ యూత్ కన్వీనర్ తట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తమాజేరులో శివాలయ నిర్మాణానికి శంఖుస్థాపన

### 55 సెంట్ల స్థలాన్ని వితరణగా అందించిన అరెకపూడి శ్రీనివాసరావు

### రూ.రెండున్నర కోట్లతో ఆలయ నిర్మాణానికి ప్రణాళిక



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** కొత్తమాజేరు గ్రామంలో సర్వాంగ సుందరంగా శ్రీ శివ పరివార ఆలయ నిర్మాణానికి శుక్రవారం శంఖుస్థాపన చేశారు. సుమారు రెండున్నర కోట్ల రూపాయలతో ఎంతో సుందరంగా పశ్చిమాభిముఖంగా ఆలయాన్ని నిర్మించే ఆలోచనతో ప్రణాళికాయుతంగా ముం దుకుసాగుతున్నారు. జనవరి 25వ తేదీన కొత్తమాజేరులో పూర్వవిద్యార్థులు, గ్రామ పూర్వ నివాసితుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో శివాలయం లేకపోవటంతో మాజేరు పరిసర ప్రాంతాల్లో ఎక్కడాలేని విధంగా శివాలయ నిర్మాణం చేపట్టాలనీ, భక్తులు స్వయంగా స్పర్శదర్శనం చేసుకునేలా ఆలయ నిర్మాణం చేపడదామని నాటి సమావేశంలో ఓ అంగీకారానికి వచ్చారు. దీంతో కొత్తమాజేరు పూర్వనివాసి ప్రస్తుతం గుడివాడలో నివసిస్తున్న అరెకపూడి శంకరరావు కుమారుడు శ్రీనివాసరావు స్థలం ఇచ్చేందుకు ముందుకువచ్చి ప్రధాన రహదారికి పక్కనే ఉన్న తన 55 సెంట్ల స్థలాన్ని ఆలయ నిర్మాణానికి దానంగా ఇచ్చారు. ఖమ్మం జిల్లాకు చెందిన శతాధిక ప్రతిష్టాచార్యులు మునగలేటి వంశీ శర్మ ఆధ్వర్యంలో ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఉదయం గం.10.29లకు మేషలగ్నంలో స్థల దాత శంఖుస్థాపన చేశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పూర్వనివాసితులు, పూర్వ విద్యార్థులు, దాతలు తలశిల చంద్రశేఖర్, బొర్రా అగ్గిరాముడు, నామా వెంకటరావు, కమ్మిలి వెంకట సుబ్బారావు, బండి నాగార్జున, వేమూరి రమేష్, వెనిగళ్ల మురళీకృష్ణ, తుమ్మల బుచ్చిరామయ్య, వల్లభనేని వెంకట్రావ్, మక్కిన శివనాగేశ్వరరావు, కళ్లేపల్లి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

# శాంతియుతంగా ఉద్యమిస్తున్న మమ్మల్ని పట్టించుకోరా?



**పెడన, మేజర్ న్యూస్ :** రైలు తగలబెట్టిన సామాజిక వర్గానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు ఐదు వేల కోట్లు కేటాయించి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారని పెడన మున్సిపల్ మాజీ చైర్మన్ చేనేత రాష్ట్ర నాయకుడు బండారు ఆనంద్ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ది నార్త్ వీవర్స్ కోపరేటివ్ సొసైటీలో ఏర్పాటుచేసిన చలో మంగళగిరి చేనేత గర్జన సమావేశ ఎజెండా నిర్వహించారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న చేనేత సామాజిక వర్గాన్ని ఎందుకు గుర్తించరు....? అని ఆయన ప్రశ్నించారు. ఈనెల 22వ తేదీన మంగళగిరిలో జరగదున్నా చేనేత గర్జన కార్యక్రమం నేపథ్యంలో శుక్రవారం నాడు స్థానిక ది నార్త్ గాంధీ వీవర్స్ సొసైటీలో చేనేత నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆనంద ప్రసాద్ మాట్లాడారు వార్షిక బడ్జెట్ కేటాయింపులో కూడా చేనేతకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. చేనేత డిమాండ్ల సాధనకై ఈ మహా ప్రదర్శన జరుగుతుందన్నారు. చేనేత కార్మిక సంఘాల సహకార సంఘాల వస్త్ర ఉత్పత్తిదారుల వస్త్ర విక్రయదారుల సంఘాల ఆధ్వర్యంలో న్యాయమైన డిమాండ్ల సాధన కోసమే ఈ గర్జన అని తెలిపారు. పిచ్చుక కోటేశ్వరరావు కట్టా హేమ సుందర్రావు యర్రా టారజన్ పేరిశెట్టి మధు గోరు రాజు తదితరులు మాట్లాడుతూ మంగళగిరిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం గాలి గోపురంనుంచి ఆదివారం ఉదయం 10 గంటలకు నేతన్న సర్కిల్ వరకు ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఏపీ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో 16 భాగస్వామ్య సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నయని తెలిపారు. ఈ సందర్భంగా జన సమీకరణ గురించి నాయకులు చర్చించారు.

# ఆకలి లేని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఆకలి లేని ఆంధ్రప్రదేశ్ ను నిర్మించాలనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పాన్ని నిజం చేసేందుకు విజయవాడ నగర పాలక సంస్థలో పరిధిలోగల అన్న క్యాంటీన్లకు నూతనంగా అడ్వైజరీ కమిటీలను ఏర్పాటుగా, నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నూతన భవనం లో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ సీఈవో వంశీధర్ పోతుల దిశా నిర్దేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో గల ప్రతి అన్న క్యాంటీన్ కి ఒక కార్పొరేటర్, వార్డ్ శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీ, వార్డ్ వుమన్ అండ్ వీకర్ సెక్షన్ ప్రొటెక్షన్ సెక్రటరీ, ఎన్జీవో సభ్యులు, స్వయం సహాయక బృంద సభ్యులు, నోడల్ ఆఫీసర్ ను అడ్వైజరీ కమిటీగా ఏర్పాటు చేశారని వీరందరూ సమన్వయంతో అన్న క్యాంటీన్లోకి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని. ప్రజా ప్రతినిధులు ఈ కమిటీకి చైర్మన్గా నిర్వహిస్తూ, అన్న క్యాంటీన్లో ఎటువంటి సమస్యలు తలెత్తనివ్వకుండా చూసుకోవాలని, కమిటీలో ఉన్న ఇతర సభ్యులతో సమన్వయం చేసుకుంటూ ఎటువంటి సమస్యలు వచ్చిన వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించేటట్టు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, కె.ప్రభుదాస్, కార్పొరేటర్లు బుల్లా విజయ్ కుమార్, ఉమ్మడి చంటి, ముమ్మనేని వెంకటప్రసాద్, పొట్లూరు శివ సాయి ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, ఎన్జీవోలు, నోడల్ ఆఫీసర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.





## ఎస్సీ సంక్షేమ సంఘం మండల ఇన్చార్జిగా ఏలియా బాబు

**ఏ కొండూరు, మేజర్ న్యూస్ :** ఏ కొండూరు మండలం ఎస్సీ సంక్షేమ సంఘం మండల ఇన్చార్జిగా మలమంటి ఏలియా బాబును నియమించారు. ఈ సందర్భంగా ఏలియా బాబు మాట్లాడుతూ దీని యొక్క ఉద్దేశం భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు ఎస్సీలకు అమలు జరిగే విధంగా కృషి చేస్తామన్నారు. ఎస్సీలపై జరుగుతున్న దాడులు అరికట్టాలన్నారు. అట్రాసిటీ కేసులు నీరుగారి పోకుండా చూసే క్రమంలో తిరువూరు నియోజవర్గ స్థాయిలో ఒక పటిష్టమైన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దానిలో భాగంగా ఏ కొండూరు మండల ఎస్సీ సంక్షేమ సంఘం ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టానన్నారు. ప్రజా సంఘాలనాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఏలియా బాబుకు శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు.

# హనుమాన్ జంక్షన్ నూతన సీఐ కార్యాలయం ప్రారంభం

## నేరాల నియంత్రణలో పోలీసుల సమర్థ సేవలు : డీఎస్పీ చలసాని శ్రీనివాస్







**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 20, మేజర్ న్యూస్ :** పోలీస్ వ్యవస్థ గత మూడు దశాబ్దాలుగా కత్తి మీద సాములా పని చేస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని చలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు. హనుమాన్ జంక్షన్‌లో దాతల సహకారంతో సుమారు కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ భవనాన్ని ఆయన శుక్రవారం ఉదయం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకప్పుడు హనుమాన్ జంక్షన్ మోటార్ ఫీల్డ్ కేంద్రంగా ఉండి గుండా చర్యలు, రౌడీయిజం ఎక్కువగా చోటుచేసుకునేవని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం సర్కిల్ పరిధిలో నేరాల శాతం గణనీయంగా తగ్గిందని, నేరం జరిగిన వెంటనే పోలీసు సిబ్బంది వేగంగా స్పందిస్తూ ప్రజల్లో విశ్వాసం పెంపొందిస్తున్నారని తెలిపారు. సీసీ కెమెరా వ్యవస్థను మరింత పటిష్టంగా అమలు చేస్తున్నామని, ఆధునిక సాంకేతికతతో నేర నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని వివరించారు.

నూతన సర్కిల్ కార్యాలయం ముందున్న పార్క్ నిర్వహణ బాధ్యతను కూడా పోలీస్ శాఖ స్వీకరించి శుభ్రత, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు ఈ నూతన భవనం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవన నిర్మాణానికి సహకరించిన దాతలను డీఎస్పీ చలసాని శ్రీనివాస్, సీఐ ఎల్. రమేష్ సన్మానించారు. కార్యాలయానికి పంచాయతీ స్థలాన్ని కేటాయించిన సర్పంచ్ సరిపల్లి కమలాబాయ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను సీఐ రమేష్, ఎస్ఐ సురేష్ తదితరులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎండీఓ జోగేశ్వరరావు, చలమలశెట్టి రమేష్ బాబు, కేతినీడి తేజోమూర్తి, పొట్లూరి ప్రసాద్, నెక్స్ట్ జెన్ రాజేంద్ర, దయాల రాజేశ్వరరావు, అట్లూరి శ్రీనివాస్, మేడికొండ రామకృష్ణ, కోమరవల్లి కిరణ్ మూర్తి, మొవ్వ వేణుగోపాల్, చింతల వెంకట శివ అప్పారావు, గుండపనేని ఉమా ప్రసాద్, పైడి సుధాకర్, గార్లపాటి రాజేశ్వరరావు, కాళీ, చక్రపాణి విజయ్ కుమార్, లయన్ తాడి రంగారావు, కళ్ళేపల్లి నారాయణరావు, మూల్పూరి దనకోటేశ్వరరావు, తాండవ కృష్ణ, బాజీ తదితరులు, పలువురు జర్నలిస్టులు, గన్నవరం సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు. నూతన కార్యాలయం ప్రారంభంతో హనుమాన్ జంక్షన్ సర్కిల్ పరిధిలో పోలీసు సేవలు మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు.

# ఎస్.ఆర్.జి.ఈ.సి.లో రోటరీ క్లబ్ వైద్య శిబిరం







**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ ఫిబ్రవరి 20 :** స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ, గుడివాడ రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని గుడివాడ రోటరీ క్లబ్ అధ్యక్షులు వై. నాగేశ్వర రావు, కళాశాల ప్రిన్సిపాల్ డా బుర్రా కరుణ కుమార్ లు ప్రారంభం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా బుర్రా కరుణ కుమార్ వైద్య శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఆరోగ్యం మన సంపద అనీ, బోధనలో, సేవలో, బాధ్యతల్లో, ఎంత ముందుంటామో, మన ఆరోగ్య సంరక్షణలో కూడా అంతే ముందుండాలన్నారు. ఈ హెల్త్ చెకప్ క్యాంప్ ద్వారా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య స్థితి గతులను తెలుసుకొని, ఆరోగ్య సంరక్షణ పై అవగాహన పెంచుకొని, అవసరమైన తగు జాగ్రత్తలు వైద్యుల పర్యవేక్షణలో తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం గుడివాడ రోటరీ క్లబ్ వారి సహకారంతో జరుగుతుందని, గుడివాడ రోటరీ క్లబ్ సభ్యులకు, హాజరైన వైద్య సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరం లో పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్, విజయవాడ నుండి హృద్రోగ నిపుణులు డా పి.ఆకాష్ , డా బి కారుణ్య చక్రవర్తి, క్రిటికల్ కేర్ వైద్యులు డా జి ఆంజనేయులు విచ్చేసి పరీక్షలు నిర్వహించి అవసరార్థులకు తగిన సలహాలు- సూచనలు చేశారు. గుడివాడ నుండి రైజ్ హాస్పటల్ అధినేత డా లల్కి చీకటి విచ్చేసి ఎముకల బలహీనతను చెప్పే నూతన పరికరం ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఇంకా ఈ వైద్య శిబిరంలో ఈ.సి.జి., 2డి ఎకో పరీక్షలు నిర్వహించారు. స్పెక్ట్రమ్ డయాగ్నోస్టిక్స్ వైద్యుల పర్యవేక్షణలో రక్తపోటు, యాధృచిక మధుమేహ పరీక్షలు జరిగాయి. ముఖ్యంగా హెచ్. సి.జి. కేన్సర్ సెంటర్ విజయవాడ నుండి వచ్చిన వైద్య బృందం పురుషులకు పి.ఎస్.ఎ కేన్సర్ పరీక్ష, స్త్రీ లకు పాప్స్మియర్ కేన్సర్ పరీక్ష, సి ఎ125 కేన్సర్ పరీక్షలకు సంబంధించి బ్లడ్ శాంపుల్స్ సేకరించారు. వీరికి పరీక్షల అనంతరం వివరాలు వారి వ్యక్తిగత మొబైల్ నెంబర్లకు పంపడం జరుగుతుందని హెచ్. సి.జి.సిబ్బంది వి కిరణ్ తెలియజేశారు. ఈ కార్యక్రమములో రోటరీ క్లబ్ అధ్యక్షులు వై నాగేశ్వర రావు, కార్యదర్శి డి కిరణ్ బాబు, అసిస్టెంట్ గవర్నర్ వై రమణ మూర్తి, మాజీ అధ్యక్షులు ఏ. సుబ్రహ్మణేశ్వర రావు, సభ్యులు కె. శ్రీనివాస్, డా లల్కి లు పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ పి సిద్దయ్య , ప్రిన్సిపాల్ డా బుర్రా కరుణ కుమార్,వైస్ ప్రిన్సిపాల్ డా పి. కోదండ రామారావు, పి.జి.సి.ఆర్.డి. డైరెక్టర్ డా జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి. ప్రసాద్, డైరెక్టర్ ఎ.ఎస్.ఏ డా ఎం.కామ రాజు, ఫ్యాకల్టీ క్లబ్ అధ్యక్షులు ప్రొఫెసర్ వి వి కె డి వి ప్రసాద్ తదితరులు వైద్య శిబిరానికి విచ్చేసిన పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ వైద్య బృందానికి,హెచ్ సి. జి. కేన్సర్ సెంటర్ సిబ్బందికి, రైజ్ హాస్పిటల్ బృందానికి, స్పెక్ట్రమ్ డయాగ్నోస్టిక్స్ వైద్యులకు జ్ఞాపికలతో సత్కరించారు. ఫ్యాకల్టీ క్లబ్ అధ్యక్షులు ప్రొఫెసర్ వి వి కె డి వి ప్రసాద్ వందన సమర్పణ చేశారు. వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# వత్సవాయి పోలీస్ స్టేషన్ పరిదిలో డ్రగ్స్ పై దండయాత్ర








**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్:** డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాలనే సదుద్దేశంతో పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు నేతృత్వంలో అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత స్వీయ పర్యవేక్షణలో డ్రగ్స్ పై దండయాత్ర అనే నినాదంతో 34 రోజులపాటు 510 కిలోమీటర్ల సైకిల్ యాత్రలోలో బాగంగా 25వ రోజు ఈ సైకిల్ యాత్ర కార్యక్రమం వత్సవాయి పోలీస్ స్టేషన్ పరిదిలో ఘనంగా ముగిసింది. శుక్రవారం డ్రగ్స్ పై దండయాత్ర 25వ రోజు సైకిల్ యాత్ర 20 కిలోమీటర్ల మేర సాగింది. ఇప్పటి వరకు 355 కిలోమీటర్లకు చేరుకుంది. ఈ కార్యక్రమం రూరల్ డి.సి.పి. బి లక్ష్మి నారాయణ, ఏ.సి.పి. ప్రసాద రావు పర్యవేక్షణలో తిరువూరు ఇన్స్పెక్టర్ కె. గిరిబాబు, గంపలగూడెం ఎస్.ఐ. జి.అనిల్ వారి సిబ్బందితో ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ రోజు ఉదయం గంపలగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో పెనుగొలను నుండి వైభవంగా ప్రారంభమై రాజవరం మీదుగా వత్సవాయి పోలీస్ స్టేషన్ పరిధిలోనికి ప్రవేశించింది. స్థానిక మహిళలు హారతులు ఇస్తూ యాత్రను ఘన స్వాగతం పలికినారు. నందిగామ ఏ.సి.పి. ఏ.బి.జి.తిలక్, జగ్గయ్యపేట ఇనస్పెక్టర్ పి. వెంకటేశ్వర్లు, సి ఎస్.ఐ. ఉమామహేశ్వర రావు ఘనంగా ఏర్పాట్లు చేసినారు. ఈ యాత్ర వత్సవాయి పోలీస్ స్టేషన్ పరిధిలో తాళ్లూరు మీదుగా ఎం.పి.పి.స్కూల్ వరకు సాగింది ఈ క్రమంలో “““డ్రగ్స్‌కు నో జీవితం మాకు కావాలి! ” అనే నినాదంతో అలుపనెది లేకుండా అత్యంత వైభవంగా ర్యాలీ సాగింది. అత్యంత ప్రజాదారణతో రెట్టింపు ఉత్సాహంతో ఈ ర్యాలీ అత్యంత ఘనంగా సాగుతుంది. ఈ క్రమంలో రాజవరం, గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యార్థులు, స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విశేష ఆధరణతో మద్దతు పలికినారు.ప్రజల మద్దతు పెరుగుతోంది అంటే కారణం ఒక్కటే: ఇది కేవలం కార్యక్రమం కాదు, భవిష్యత్తు కోసం జరుగుతున్న యుద్ధం. ఇది ఒక ర్యాలీ మాత్రమే కాదు. ఇది యువత భవిష్యత్తు కాపాడే సంకల్పం. ప్రజల ఆధారణాలతో ఈ దండయాత్ర మరింత శక్తిగా, మరింత వేగంగా ముందుకు దూసుకుపోతుంది. ఈ సందర్భంగా అధికారులు డ్రగ్స్ పై ఎటువంటి సమాచారాన్ని అయిన 112 కు గాని 1972 కి గాని తెలియజేయాలని, అదేవిధంగా ప్రతి ఒక్కరూ https://events.ntrpolice.in/ లాగిన్ అయ్యి రిజిస్టర్ అవ్వలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, సుమారు 1000 మంది వరకు అధ్యాపకులు, విద్యార్థులు, పెద్ద ఎత్తున స్థానిక మహిళలు పాల్గొన్నారు.



# ఏఏబిఎస్‌టిఏ దర్బార్‌లో ప్రారంభమైన రంజాన్ వేడుకలు



**రెండవ రోజు ఇఫ్తార్ విందు**

**30 రోజులు ఇఫ్తార్ విందు**

**నిజాం బాబా వెల్లడి**



**మైలవరం, మేజర్ న్యూస్ :** మండలంలోని చీమలపాడు గ్రామంలో వేంచేసి ఉన్న పవిత్ర పీర్ ఓ ముర్షిద్ హజ్రత్ సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి పవిత్ర దివ్య ఆశీస్సులతో జంపనీలోని ఏ ఏ బి ఎస్ టి ఏ దర్బార్ లో పీఠాధిపతి అత మొహమ్మద్ ఖ్వాజా నిజముద్దీన్ షా తాజ్ ఖాదరి (నిజాం బాబా) వారి ఆధ్వర్యంలో రంజాన్ మాస వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిజాం బాబా మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా భక్తులకు సమాజంలోని ప్రతి ఒక్కరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసాన్ని భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక సోదర భావం, మానవ సేవ భావంతో ఆచరించుకుంటున్నామన్నారు. సూఫీ సాంప్రదాయ ప్రకారం రంజాన్ అనేది ఆధ్యాత్మిక పరిశుద్ధత, ఆత్మ నియంత్రణ, అల్లాః స్మరణకు అంకితమైన పవిత్ర కాలం అన్నారు. ఈ మాసంలో మన హృదయాన్ని అహంకారం నుంచి వినయానికి చీకటి నుంచి దైవీక వెలుగుకు తీసుకెళ్లే ఆధ్యాత్మిక ప్రయాణంగా భావించబడుతుందన్నారు. ఈ దర్బార్ లో రంజాన్ మాసం 30 రోజులు ఉపవాస దీక్ష పరులకు ఇఫ్తార్ విందుతోపాటు కుల మతాలకు అతీతంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నిరుపేదలకు తమ వంతుగా ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించడం, ప్రేమను, శాంతిని, వ్యాప్తి చేయడం ప్రతి ఒక్కరూ ఈ పవిత్ర సేవలో పాల్గొని ఆశీర్వాదాలు పొందాలన్నారు. ప్రతి ఒక్కరూ నిజమైన భక్తితో ఉపవాసం పాటించి నమాజ్, ఖురాన్ పారాయణం, దానధర్మాలను పెంచాలని మనవి చేస్తున్నామన్నారు. ఈ రంజాన్ మన హృదయాలను పరిశుభ్రం చేసుకొని సోదర భావాన్ని బలపరుచుకొని అల్లాహ్ తో మన బంధాన్ని మరింత బలపరుచుకునే అవకాశంగా మారాలన్నారు. అల్లాహ్ మన ఉపవాసాలు, ప్రార్ధనలు, సత్కార్యాలను అంగీకరించి మన జీవితాలను కరుణ, శాంతి, ఆశీర్వాదాలతో నింపాలని అందరికీ రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు.

# కొండపల్లి బొమ్మల పోటీ 2026 ప్రారంభించిన జేసీ




**కొండపల్లి మేజర్ న్యూస్ :** కొండపల్లి బొమ్మల పోటీ 2026ను కొండపల్లి ఎక్స్ పీరియన్స్ కేంద్రంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిఆర్.జి.లక్ష్మీషా ఆధ్వర్యంలో, జిల్లాజాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, ఐఏఎస్, కొండపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చెన్ను బోయిన చిట్టిబాబు, పర్యాటక శాఖ అధికారులు, ఆర్ టి ఐ హెచ్ విజయవాడ సీఈవో జి కృష్ణన్, కొండపల్లి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సొసైటీ ప్రతినిధులు, కళాకారులు తదితరులు అధికారికంగా ప్రారంభించారు. ఈ పోటీని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టిఐహెచ్)విజయవాడ ఆధ్వర్యంలో, ఎన్టీఆర్ జిల్లా పరిపాలన, పర్యాటక శాఖ మద్దతుతో, కొండపల్లి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సొసైటీ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొండపల్లి బొమ్మల సంప్రదాయ కళ పరిరక్షణ అవసరాన్ని వివరించి, కళాకారులకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.ఈ పోటీ ద్వారా సంప్రదాయ కళను ప్రోత్సహించి,కళాకారుల జీవనోపాధి అవకాశాలు మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. కార్యక్రమ షెడ్యూల్ దరఖాస్తుల స్వీకరణ కాలం, 20-02-2026 నుండి 21-02-2026 రాత్రి 10 గంటల వరకు పోటీ నిర్వహణ కాలం 22-02-2026 నుండి 08-03-2026 వరకు పూర్తయిన బొమ్మల సమర్పణ తేదీ: 09-03-2026సమయం: ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు మూల్యాంకనం & బహుమతుల ప్రదానం: : మొత్తం బహుమతులు, సర్టిఫికెట్ల విలువను రూ.1,00,000గా ప్రకటించారు. అంశాలు వారసత్వం, సంస్కృతి జెన్ జెడ్, ఆధునికత పండుగలు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు& ఇతరములు..

# 100 రోజుల ప్రణాళిక అమలును పరిశీలించిన ప్రత్యేక బృందం



**పామర్రు మేజర్ న్యూస్ :** విద్యాశాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు నిర్దేశించిన 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలులో భాగంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించేందుకు ప్రత్యేక బృందం మండల పరిధిలోని పలు పాఠశాలలో శుక్రవారం పర్యటించింది. ఈ బృంద సభ్యులు ఆయా పాఠశాలలో వందరోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు జరుగుతున్న తీరు, విద్యార్థులు ఆయా సబ్జెక్టుల పరిధిలో మెరుగైన విధానం తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులతో విద్యార్థుల ప్రగతిపై సమీక్షలు నిర్వహించారు. ఇటీవల జరిగిన ప్రీ కామన్ పరీక్షలలో విద్యార్థులకు వచ్చిన మార్కులను పరిశీలించి అందుకు అనుగుణంగా తీసుకోవలసిన చర్యలపై ఉపాధ్యాయులకు సూచనలు అందించారు. అంతేకాక రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏ విధంగా సంసిద్ధం కావాలనే అంశాలను విద్యార్థులకు వివరించడంతోపాటు తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి వారికి వివరించారు. పదవ తరగతి పరీక్షలలో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులు అయ్యేందుకు తీసుకోవలసిన చర్యలపై అటు ఉపాధ్యాయులకు, ఇటువిద్యార్థులకు వేర్వేరుగా తగు సూచనలు, సలహాలను అందజేశారు. విద్యార్థులలో చైతన్య కల్పించడం ద్వారా ప్రతి ఒక్క విద్యార్థి పదవ తరగతి ఉత్తీర్ణత పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీలక్ష్మి వివరించారు. మొవ్వ మండల విద్యాశాఖ అధికారి - 2 కె.శ్రీలక్ష్మి నేతృత్వంలో పర్యటించిన ఈ బృందంలో మొవ్వ మండలంలోని నిడుమోలు క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణ, సబ్జెక్టు ఉపాధ్యాయులు ఎన్.రామకృష్ణ (తెలుగు), వి.ఎం.సోలంకి (హిందీ), ఎం.అనురాధ (ఇంగ్లీష్), ఎం.రాణి (లెక్కలు), పి.శివ కోటేశ్వరరావు (ఫిజికల్ సైన్స్), పి.సుధారాణి (బయోలాజికల్ సైన్స్), జి.సుబ్బారావు (సోషల్) సభ్యులుగా ఉన్నారు. మండల పరిధిలోని అడ్డాడ, జమీగొల్వేపల్లి, జమీదగ్గుమిల్లి, నిమ్మకూరులలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో ఈ బృందం పర్యటించింది. ఈ కార్యక్రమంలో అడ్డాడ సి.ఆర్.పి. పి.యు.ఎన్.వి.ఎం.వేణి, దగ్గుమిల్లి క్లస్టర్ సి.ఆర్.పి ఎం. ప్రశాంతి పాల్గొన్నారు.





## శ్రీ పుట్లమ్మ, శ్రీ మారెమ్మ తల్లి నూతన ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వసంత

**కొండపల్లి మేజర్ న్యూస్ :** శ్రీ పుట్లమ్మ, శ్రీ మారెమ్మ తల్లి అమ్మవార్ల ఆశీస్సులు అందరిపై ఉండాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు ఆకాంక్షించారు. కొండపల్లి పట్టణంలో ఈ నెల 22న జరగనున్న శ్రీ పుట్లమ్మ, శ్రీ మారెమ్మ తల్లి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు శుక్రవారం ఆలయాన్ని సందర్శించారు. నేడు అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపు సందర్భంగా, అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదుకి ఘనంగా స్వాగతం పలికారు. స్దానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వెంకాయమ్మ పేరంటాలమ్మకి చీర, సారే సమర్పణ



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** రామవరప్పాడులోని శ్రీశ్రీశ్రీ వెంకాయమ్మ పేరంటాలమ్మ దేవస్థానంలో విజయవాడ రూరల్ మండలం ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి ఇటీవల కాలంలో కొమ్మ కోటేశ్వరరావు (కోట్లు) క్షేమంగా ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుబడి కార్యక్రమంలో అమ్మవారికి చీర, సారే సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గన్నవరం నియోజకవర్గ నాయకులు కోమ్మా కోటేశ్వరరావు (కోట్లు), విజయవాడ రూరల్ మండలం ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, జడ్పిటిసి కాకర్లమూడి సువర్ణరాజు, సమ్మెట సాంబయ్య, చెన్ను కమల్ రాజ్, పిన్నిబోయిన రవి, గోపి, బోయిన భాను, నాయకులు, కార్యకర్తలు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు



**మొవ్వ మేజర్ న్యూస్ :** ఈనెల 23వతేది నుంచిమొవ్వక్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరగనున్న ఇంటర్మీడియట్ సంవత్సరాంత పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు కూచిపూడి పోలీస్ స్టేషన్లో భద్రపరిచారు. సెట్-1 ప్రశ్నపత్రాలు,సెట్-2 ప్రశ్నాపత్రాలు రాగా వాటిని శుక్రవారం కూచిపూడి ఎస్సై చావా.సురేష్ పర్యవేక్షణలో రైటర్ రమేష్ ట్రంకుపెట్టెలలో పెట్టిసీల్ వేసి భద్రపరిచారు. ప్రశ్నాపత్రాలను ఆ కళాశాలఛీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.సుధాకరరావు, డిపార్ట్మెంట్ ఆఫీసర్ ఎం.ఆదివిష్ణు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999